
# అయామే బ్యాడ్ బాస్

సి. సుజాత



గాజుగోళీ లోపల అందమైన రెండే రెండు పువ్వులు... ఆకుపచ్చని రెమ్మలు... అందిట్లోనే మెరిసే బంగారు రంగు బుల్లి గుండ్లు. ముచ్చటగా కనిపిస్తోంది పేపర్ వెయిట్. సుహాసిని దాన్ని చేతిలోకి తీసుకొంది.

ఫాన్ గాలికి కాయితాలు రెపరెపలాడాయి. గబుక్కుని పేపర్‌వెయిట్ వాటిపైన పెట్టేసింది. పైన బరువు పడేసరికి ఇక లేచే శక్తి నశించి చుట్టు అంచుల్లో రెపరెపలాడుతున్నాయి కాగితాలు. అచ్చం రహస్యం గుప్పిట్లో పట్టి బంధించినట్లే. పైకి రానీయకుండా గుండె లోతుల్లో దాచేసినట్లు జీవితంలో ఒలికిపోయినవన్నీ ఇతరుల కంట పడనీయకుండా దాచి వుంచుకొన్నట్లు.

వీల్-ఛైయిర్‌లో సుహాసిని గుండ్రంగా తిరిగింది. 'తనచుట్టూ తానే తిరుగుతున్న భూమి లాగా వుందా...?'

'అబ్బా'-తలపట్టుకొని వెనక్కివాలి కూచుంది సుహాసిని. ఒక్క నిముషం కూడా తనకి విముక్తి లేదా? వెంటాడి వేధించే ఆలోచనల్నుంచీ, నిజాల్నుంచీ... ఈ మురికి బతుకు నుంచి తనకు విముక్తి లేనే లేదా?

డోర్ తట్టిన శబ్దం.

'ఎస్ కమిన్' అంటూనే గిర్రున తిరిగింది సుహాసిని. తిన్నగా స్థిమితంగా ఉన్నట్లు వెన్నెముక నిటారుగా అయింది. కళ్ళజోడు చేతిలోకి తీసుకొంది. అసంకల్పితంగానే ఫైల్ చేతిలోకి వచ్చింది.

నాయుడు లోపలకి వచ్చాడు.

ఏమిటన్నట్లు కళ్ళజోడులోంచి అతనివైపు చూసింది.

'ఇవ్వాళ మీటింగ్ ఉందా మేడమ్...'

సుహాసిని క్షణం పాటు ఆలోచించింది.

'వుందా? లేదా? వున్నందువల్ల లాభమా? నష్టమా? ఎవరికీ? కంపెనీకా తనకా?'

ఆలోచన ఆపి నాయుడు వంక చూసింది.

'ఏం ఎందుకు లేదనుకొన్నారు?'

'రేపు గుడ్‌ఫ్రైడే కదా మామ్? ఈవినింగ్ త్వరగా వెళ్లిపోవాలని స్టాఫ్...'

చురుగ్గా చూసింది సుహాసిని.

'ఏవిట్టూ... రేపు హాలిడేనే కదా...చాలదటనా? అరగంటలో వస్తున్నాను..

రెడీగా వుండమను. మీటింగ్‌కు అరేంజి చేయ్'

చేతిలో ఫైల్ విసురుగాపడేసింది సుహాసిని. లోపల ఏదో లావా కరుగుతోంది. చెప్పలేని దిగులు... సెగలు... కుతకుతమంటున్న లావా చాలా చల్లగా అయిపోతోంది అప్పటికప్పుడే.

'అవును... ఏం... ఇవ్వాళ పాపం వాళ్ళకి పనేమయినా వుందేమో. షాపింగో ఏదో వుంటుంది కదా... దేవ్‌రాజ్‌కి కొత్తగా పెళ్ళయింది. సెలవురోజు కూడా చర్చిలోనే గడిపేసే భక్తి. ఇవ్వాళ ఎక్కడికయినా వెళ్లాలని అనుకున్నారేమో'

వెయిట్ మళ్లీ చేతిలోకి తీసుకొంది సుహాసిని. నాయుడు అడుగు ముందుకు వేసి వెబ్‌స్టర్ డిక్షనరీ తీసి గాలికి ఎగరడానికి సిద్ధంగావున్న పేపర్లపైన పెట్టాడు. రాక్‌లో పుస్తకాలు సర్దడం మొదలుపెట్టాడు. సుహాసిని బరువు పెట్టిన కాగితాల వంకే చూస్తోంది. 'పాపం ఇంక అవి కదల్లేవు. ఇపుడు కనీసం రెపరెపలాడటం కూడా మానేశాయి. జీవితంలో ఏ వెల్తి ఇక బయటకు రానే రాదు...'

రాదా... రావడం లేదా? ఎక్కడలేని అశాంతీ, ఏ రూపంలో బయటపడుతుందో తనకు అర్థంకావడం లేదు.

భాస్కరంగారితో తన రొమాన్స్... జాగ్రత్తగా, తను నొచ్చుకోకుండా తనకిష్టమైన రీతిలో... ఆవేశం కోరిక ఉ(గ్రూతలూపాయా?

'దేవరాజ్‌ను నువ్వు పొద్దున ఎలా చూశావో గుర్తుతెచ్చుకో...' అంది చల్లారుతున్న లావా.ఈ కరిగి మండటానికి అనుక్షణం సిద్ధంగావున్న ఈ లావా ఎలా లోపలకి చేరిందబ్బా...?

సుహాసిని పెదవులపైకి చిన్ని కోపరేఖ. కళ్ళచివర్లలో ఒక తడి.

ఉదయం కారులో వస్తుంటే దేవరాజ్, వాడి భార్య నవ్వుకొంటూ రోడ్డుదాటటం కనిపించింది.ఎంత అప్యాయంగా ఆవిడ నడుంచుట్టూ చేతులువేశాడు. ఆ నీరెండలో ఆ అమ్మాయి మొకంలో ఎంత సంతోషం. ఎంత తృప్తి. అతని మొకంలోకి చూస్తూ నవ్వుతోంది. కారు దాటి వచ్చేసింది. ఆ సంఘటన కళ్ళ ముందుకి రాగానే సుహాసిని మొకంలోకి రక్తం చేరుకొంది.

'ఎప్పుడైనా... జీవితంలో ఒక్కసారైనా... తనెప్పుడైనా అలా కువకువమని నవ్వివుంటుందా? దేవరాజ్ మాదిరిగా తన భుజంచుట్టూ చేతులువేసి భాస్కరం గారు తనను నడిపించారా? నైట్‌డ్యూటీ చేసివస్తే తన కోసం ఇల్లు నిశ్శబ్దంగావుంటుంది. తలుపు తీసి మర్యాదగా నవ్వి 'ఏదయినా తినరాదా' అంటారాయన...

'వద్దు ఆకలి లేదు'

'పోనీ కొంచెం పాలు తాగు...'

తాగాలనిపించినా అతను అడిగాడు కనుక వద్దంటుంది తను.

విశాలమైన డబుల్‌కాట్ పైన తను చేతులు జాపి పడుకుంటుంది స్వేచ్ఛగా.

వినయపూర్వకంగా... తన ఎదురుగ్గా ఆయన.

గోడకి ఆనుకొని నిలబడిన ఆయన మొకంలో ఒక లాటి సంశయం.

రమ్మంటుందా? వద్దంటుందా?

తనకూ సందేహం.

తన పిలుపు రమ్మని అయినా, వద్దని అయినా అవతల మనిషిలో రియాక్షన్ ఒకటే. ఒక వినయం. సంపాదించే యజమాని పట్ల పనివాడు ప్రదర్శించే వినయం.

ఒకవేళ తను అంగీకారం ప్రదర్శించే మొకంపెట్టినా, అందులో మమకారం, ఇష్టం, అభిమానం వున్నాయా?

భాస్కరంగారితో తన రొమాన్స్... జాగ్రత్తగా, తను నొచ్చుకోకుండా తనకిష్టమైన రీతిలో... ఆవేశం కోరిక ఉ(గ్రూతలూపాయా? రెండు శరీరాల రాపిడి తప్పించి... జ్వలించటం... ఉప్పొంగిన సముద్రం లాంటి కథల్లో అక్షరాల వరసలు తనకు అనుభవంలోకి వచ్చాయా? ఏమీలేదు... అయిపోతోంది.

'పడుకో... రెస్ట్ తీసుకో?' భాస్కరం తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోతాడు... ఇక ముంచెత్తే ఒంటరితనంలో నిలువునా మునిగిపోతూ...కూరుకుపోతూ అందులోనే ఉండిపోతూ... ఎన్నాళ్ళు... ఎన్నేళ్లు.

డబ్బు అవసరాలు పెరుగుతూనే వున్నాయి. సంపాదనా మార్గాలు అన్వేషిస్తూ విసుగులేని.. తరుగులేని రహదారిలో ఊపిరి తీసుకోకుండా పరుగులు తీస్తూ... స్పష్టంగా తెలిసిపోతాయి. మూసుకుపోతున్న మనసు కవాటాలు. ఏదైనా దొరికితే కదా తిరిగి ఇవ్వడానికి. ఎప్పుడూ... ఏదీ దొరకని శూన్య హస్తాలు. చివరకు పిల్లలయినా..

హాస్టళ్ళలో...గొప్పగొప్ప రెసిడెన్షియల్ స్కూళ్ళలో... అమెరికన్ స్టయిల్ జీవిత విధానంలో...

'హౌఆర్యు మామ్...ఫైన్' లెక్కల పలకరింపులు. చదువులు, సెలవుల్లోనూ కోచింగ్‌లు, రిలాక్సేషన్ టూర్లు... అన్నింటి మధ్య మాతృస్థానం ఎక్కడో డబ్బుల బీరువా పిడిలోదూరి కనిపించకుండా ఎగిరిపోయింది.

భాస్కరంగారి దగ్గర ఎన్నో రెడీమేడ్ సమాధానాలుంటాయి.

'నువ్వు బిజీ కదా సుహా... లాస్ట్‌వీక్ అమ్ములు వస్తానంది. నీకు కాన్ఫరెన్స్.మంత్ ఎండింగ్‌కు బాబు వస్తాడు. నీకు నెక్స్ట్‌వీక్ వరకు టూర్‌ప్రోగ్రాం వుంది. వాళ్ళు డిసప్పాయింట్ అవుతారు పాపం.తప్పదుకదా. కెరీర్ ముఖ్యం'

ఎవరికీ కెరీర్...ఆ మాట అనకుండా స్పెషల్ బిల్స్ గురించి మాట్లాడితే ఎంత బావుండు. 'చాలా డబ్బు వస్తుంది కదా' అని హాయిగా చెప్పవచ్చు కదా.

ఫోన్‌లలోనే తనూ, తన పిల్లలూ కురిపించుకొనే ప్రేమవర్షంలో ఎన్నాళ్ళబట్టి తను తడుస్తుంది.

'బాబూ టూర్‌కి వెళతావా కన్నా. ఫైవ్ థౌజండ్స్ పంపుతున్నా... హాయిగా ఎంజాయ్ చేయండి

డాలీ... డ్రెస్‌లు నచ్చాయా? నీ కోచింగ్ ఎలావుందీ?'... ఎంత గొప్ప అమ్మదనపు కమ్మదనం.

సుహాసిని మనసు రెక్కలు కట్టుకొని వాళ్ళమ్మ దగ్గరకు పరుగులు తీసింది. ప్రహరీగోడకు దించిన పెంకుల పంచ. వంటిల్లు. బాదంచెట్టు కింద రోలు. పెసర పచ్చడి రుబ్బుతో అమ్మ. రాలి పడిన ఎర్రెర్రని బాదం ఆకులమధ్య కాళ్ళు తాకించకుండా నడుస్తూ తను.

'హాయిగా ఆఫీసర్ అవ్వవే సుహా... ఈ తీరికలేని అరవ చాకిరీ నీకొద్దే అమ్ములూ.. హాయిగా కార్లో ఆఫీస్‌కు పోయి బోలెడు డబ్బు సంపాదించి....'

అది దమ్మిడీ సంపాదన లేని అమ్మ ఆశ. ఆవిడ బతుకులో తనకు తెలిసినంత వరకూ అంతులేని చాకిరి. ఎపుడూ దానం అడిగే చేతులు. అవతల మనిషి దయతో ఇచ్చిన జీవితం. తన భవిష్యత్తు విషయంలో ఆవిడ ఆశ సరైనదే. ఆవిడకు దక్కిన జీవితం ఏదీ? ఆ జీవితం ఆమెకు సుఖం సంతోషం ఇచ్చిందా?

విసుగూ... కోపం... ఎవరిపైనో ఉక్రోషం... కోడలి పనిలో తప్పులు వెతకటం. కొడుకు నోరుతెరిస్తే తనను తక్కువ చేశాడని కన్నీళ్ళ సముద్రం కావడం...

తనకి ఇప్పుడే అర్థం అవుతోంది. ఏ వెర్రి ఆవిడను అలా వెర్రిదాన్ని చేస్తోందో. ఒక్క విషయంలోనూ స్వతంత్రం లేదు. స్వేచ్ఛ లేదు. దయాదాక్షిణ్యంతో దొరికిన జీవితంలో ఏ రసస్పందనాలేదు. యజమాని కింద బతికే పనిమనిషి అనుభవం!

పోనీ మరి తనకేమయిందీ?

తను బానిస కాదుకదా. తనే రాజు. మరెందుకీ వెర్రి. దొరికిన స్వేచ్ఛలో... తనకెందుకు ఆనందంలేదూ. రెక్కలు అల్లారుస్తూ ఆకాశంలో ఎగిరే శక్తివున్న ఆ పక్షి దీనంగా తనంతటతానే బందీగా ఎందుకుందీ? ఎక్కడుందీ లోపం...

ఆలోచనలు తెంపేస్తూ తలుపులు తెరుచుకున్నాయి.

దేవరాజ్ లోపలికి వచ్చాడు.

పొడుగ్గా చక్కగా వున్నాడు. అందంగా నీట్‌గా... సుహాసిని దీక్షగా అతని చేతులవైపు చూసింది. ఆ చేతులే ఆ పిల్లని దగ్గరకు లాక్కుని లాలించాయి. ఆ చేతుల్లో బలం... లాలన. అవతల మనిషికి అందించిన ధైర్యం. భాస్కరం తన కోసం ఇవ్వలేనివన్నీ ఆ క్షణంలో కనిపించాయి. కానీ తను ఆధారపడిన మనిషి కాదే. ఎవరో, ఏవిటో,ఎందుకో...తనకేమిటి ఇవ్వాలి. ఆ ఇవ్వని కొంచెం మొత్తం బతుకుని తలకిందులు చేసేంత బలమైనదా? శరీరాల మధ్య, మనిషికీ మనిషికీ మధ్య, భాష మధ్యని స్పర్శ మధ్యని జీవిత సాఫల్యం ఇమిడే వుందా?

'ఏం దేవరాజ్ ఇప్పుడే వెళ్ళిపోతానన్నావుట. మీ మేడమ్ తొందరగా రమ్మన్నారా'

తన గొంతులో వినిపించిన వెటకారానికి తనకే ఆశ్చర్యంవేసింది సుహాసినికి.

దేవరాజ్ ఖచ్చితంగా కంగారుపడ్డాడు.

'లేదండీ మేడం లేదు'... అన్నాడు ఆదుర్దాగా.

'ఇంకా ఏదన్నా అనూ...వీడిమొకం ఇంకా మాడిపోవాలి' అంటోంది ఏదో లోలోపల. లోపల లావా మళ్ళీ కుతకుతమని ఉడుకుతోంది- సెగలు... పొగలు...

**సుహాసిని కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడింది. ఆశోకచెట్టు ఆకు ఒకటి గిరికీలు తిరుగుతూ నేలకుజారింది. చల్లని వర్షపుగాలి. సుహాసిని ముంగురులు కదిలాయి**



తను అచ్చం అమ్మలాగే... అమ్మ వదినను దెప్పిపొడిచినట్లే... సాధించి ఆవిడ మొకంలో ఆనందం మాయం చేసినట్లే.

తనకు దొరకనిది ఏదో వదినకు దొరికిందని అమ్మ పసిగట్టింది. ఖచ్చితంగా ఆవిడకు అది అందలేదు. అది అన్న వదినకు ఇచ్చే గౌరవం, ప్రేమ కావచ్చు. వదిన అనుభవించే జీవిత మాధుర్యం కావచ్చు. ఏదైనా సరే తనకులేదు. ఆవిడకు ఉంది. అదీ అమ్మ ఉక్రోషానికి కారణం.

'ఏం దేవరాజ్ నీకు ఆఫీస్‌కంటే ఇల్లే నచ్చినట్లుందే. పోన్లే ఇవ్వాళ మీటింగ్ మానేద్దాం... సరేనా?'

సుహాసిని కిటికీలోంచి బయటకుచూస్తోంది.బయట మబ్బులు ముంచుకొస్తున్నాయి.వర్షంవస్తే కష్టం. రోడ్లు బ్లాకయిపోతున్నాయి. ఇవ్వాళ మీటింగ్ కాన్సిల్ చేస్తేనే నయం. ఈ సంగతి దేవరాజ్‌కు అర్థం అవకూడదు.

'లేదు మేడమ్. నాకేం పనిలేదు... నేను వెళ్లాలని అనలేదు మామ్'

'ఫర్వాలేదోయ్ నువ్వు ఎంజాయ్ చేయి. ఇవ్వాళ మీటింగ్ కాన్సిల్. నీకు సంతోషమే కదూ'

దేవరాజ్ మొకంలో సంతోషం ఆనవాలులేకుండా పోయింది.

'ఇవ్వాళ ఇంటికి పోయినా వీడి మొకంలో ఆనందం తిరిగిరాదు. ఆవిడ చుట్టూ చేతులువేసే లాలనలు ఉండవు. ఇవ్వాల్టికి ఆవిడ కువకువమనదు. మేడమ్‌కు ఎందుకో కోపం తెప్పించాననే భయంతో ఇవ్వాళరాత్రి వీడికి కాళరాత్రి'

సుహాసిని లేచి నిలబడింది.

లోపల మరుగుతున్న లావా ఆరిపోయింది. మళ్ళీ ఘనీభవించింది. చల్లగా. వీల్ ఛెయిర్ కొంచెం భయంగా తిరిగి ఆగిపోయింది. దేవరాజ్ నిలబడే వున్నాడు.

'యుకెన్ గో' అన్నది సుహాసిని.

దేవరాజ్ నెమ్మదిగా వెళ్ళిపోయాడు.

సుహాసిని కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడింది. ఆశోక చెట్టు ఆకు ఒకటి గిరికీలు తిరుగుతూ నేలకుజారింది. చల్లని వర్షపుగాలి. సుహాసిని ముంగురులు కదిలాయి.

'నాకు ఏమయిందీ?' అంది సుహాసిని కిటికీ చువ్వలకు తల ఆన్చి. గాలికి ఇంకాసిని పండుటాకులు జలజలమని రాలాయి.

ఎక్కడో ఏదో జీవనసూత్రం రాలిపోయింది. మనుషుల మధ్యని ఇచ్చుకొనేందుకు, పుచ్చుకొనేందుకు డబ్బుతప్ప ఇంకోటి లేకుండాపోయాక... ఎవరికేనా కాస్త మనవల్ల మంచి జరగాలంటే అందిట్లో లాభనష్టాల లెక్కలు మనసులో మెదిలాక మనకి మనమే సంకెళ్ళు వేసుకొన్న స్వేచ్ఛలో దొరికిన సంతోషం ఎంత మాత్రం?

కిటికీలోంచి బయట లేస్తున్న గాలిదుమారం కనిపిస్తోంది. సుళ్ళు తిరుగుతూ గాలి ఆకులను చుట్టపెట్టేస్తోంది.

'అచ్చం నా మనసులాగే వుంది' అన్నది సుహాసిని కిటికీ చువ్వలతో.

ఇవ్వాళ దేవరాజ్ మొకంలో సంతోషం లాగేశాక తన మనసుకు కలిగిన స్వాంతన ఏమిటీ? ఒక వికారమైన చేష్టగాక. ఎందుకలాటి విచిత్రమైన జబ్బు.

గబాగబా పెరిగి పచ్చగా అల్లుకోవలసిన చెట్టును ఎక్కడికక్కడ కండిషన్ చేసి మనకు అనుకూలంగా ఎదగనిచ్చినట్లు..బతుకుని అందరికీ అనుకూలమైన రీతిలోకి మలుస్తూ ఏ గ్లాసులోపోస్తే ఆ రకం రూపంతీసుకొంటూ తను అనుభవించే స్వేచ్ఛ గిరికీలుకొట్టే తీరు ఎలాటిదీ?

ఇప్పటికి తన లోపలి డొల్లతనం తనను తీర్చిదిద్దిన ఆకారం ఎలాటిదీ?

'తనకు లేని సంతోషం ఇతరులకు దక్కితే ఊరుకోలేని... సహించలేని...'

సుహాసిని కిటికీ చువ్వలకు ఆనించిన తల వెనక్కి తీసుకొని పకపకమని నవ్వింది.

'ఎస్... ఎస్... అయామే బ్యాడ్ బాస్'

గాలి తెరలుతెరలుగా కిటికీలోంచి లోపలికి వచ్చింది. రాలిపడిన ఆకులతో పాటుగా... సుహాసిని చేతుల్లోకి పండి ఎండిన తెల్లని ఆకు రాలింది.

'నువ్వు ఇప్పుడు జీవంలేని ప్రాణివి.. చిగురించలేని జీవివి..' సుహాసిని దాన్ని పైకెత్తి చూసింది.

ఇదే నేను...ఇది నేను... మళ్ళీ ఇది చిగిరిస్తే. మళ్ళీ పచ్చగా గాలికి ఊగితే.. మళ్ళీ జీవితం మొదలయితే..

'ఏం చేస్తావ్ సుహా...'

సుహాసిని తల అడ్డంగా ఊపింది. ఏదీ జరగదు.

చల్లని వర్షపు చినుకులు కిటికీలోంచి సుహాసిని బుగ్గలపైన పడ్డాయి.

లోలోపలి లావా చల్లబడి ఘనీభవించి పోయింది.

'అయామే బ్యాడ్ బాస్'!

వెండి దారాల్లాగా వర్షపుతీగలు సాగుతూ... నేలంతా తడుస్తోంది. ఎండి వాలిన ఆకులపైన మట్టిచిందులు కప్పేస్తున్నాయి.

'నిన్ను నువ్వయినా కనీసం ప్రేమించుకో సుహా..' అన్నట్లు వర్షం శబ్దంచేస్తోంది. ●